ఆంధ్రజ్యోతి

5 పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

సోమవారం 18 మార్చి 2024







పాలకొండలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపులను పరిశీలిస్తున్న కలెక్టర్

మన్యంలో తొలిసారిగా..

- జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత మొదటి ఎన్నికలు
- పక్కాగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు





పార్వతీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవగా పార్వతీపురం మన్యం జిల్లాలో మాత్రం తొలిసారిగా ఎన్నికలు జరగనున్నాయి. సాలూరు, కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాలతో మన్యం జిల్లా ఆవిర్భవించి రెండేళ్లు గడుస్తున్నాయి. కాగా జిల్లాలో మొదటిసారిగా లోక్‌సభ, శాసన సభలకు ఎన్నికలు జరగనుండడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పక్కా ప్రణాళికలతో అడుగులు వేస్తోంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా పెట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎటువంటి గొడవలు, ఘర్షణలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు వేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. మొత్తంగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సాలూరు పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలకు విజయనగరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, పాలకొండ నియోజకవర్గానికి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగేవి. అయితే ప్రస్తుత ఎన్నికలు మాత్రం పార్వతీపురం మన్యం కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఆయన అరకు పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

జిల్లా స్వరూపం ఇదీ..

మన్యం జిల్లాలో రెండు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీ, 15 మండలాలు ఉన్నాయి. సాలూరు నియోజకవర్గం పూర్తిస్థాయిలో జిల్లాలో లేదు. ఇందులో భాగమైన మెంటాడ విజయనగరం జిల్లాలో ఉంది. ఏవోబీ వివాదాస్పద ప్రాంతం కొఠియా, మావోయిస్టు ప్రభావిత గ్రామాలు మన్యం జిల్లాలో ఉన్నాయి. జిల్లా పరిధిలో 9 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయి. ఇందులో కొన్ని మండలాలు ఒడిశా సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ మండలాల్లో గిరిజనులు అత్యధికంగా అటవీ ఉత్పత్తుల పైనే జీవనం సాగిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, సాలూరు మండలాల్లో అత్యధికంగా జీడి సాగు ప్రధాన జీవనాధారంగా చెప్పవచ్చు. కాగా జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు అరకు పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలో 2,02,302 మంది, కురుపాంలో 1,93,073 మంది, పార్వతీపురంలో 1,88,438 మంది, పాలకొండలో 1,93,920 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తంగా నాలుగు నియోజకవర్గాల్లో 7,77,733 మంది ఓటర్లు ఉన్నారు. వారంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని, కోడ్ ఉల్లంఘించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



రావుపల్లి రహదారికి ఆనుకుని ఉన్న ఎండీయూ వాహనం

పల్లెల్లో అమలు కాని కోడ్

గరుగుబిల్లి, మార్చి 17 : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు కావడం లేదు. ప్రధానంగా ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే ఎండీయూ వాహనాలపై రెండు వైపులా సీఎం జగన్ ఫొటోతో పాటు నవరత్నాలకు సంబంధించిన చిత్రాలు దర్శనమిస్తున్నాయి. మండలంలో రావుపల్లితో పాటు పలు చోట్ల అయా ఫొటోలతో రేషన్ వాహనాలు కనిపిస్తున్నా.. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ వాహనాలకు కోడ్ వర్తించదా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం మరికొన్ని పంచాయతీల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలు అధికంగా దర్శనమిచ్చాయి. వాటిని తక్షణమే తొలగించాలని, పక్కాగా ఎన్నికల నియమావళిని అమలు చేయాలని పల్లెవాసులు డిమాండ్ చేస్తున్నారు.

హైవేపై వాహన తనిఖీలు..

సాలూరు రూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో 26వ నెంబర్ జాతీయ రహదారిపై సాలూరు రూరల్ పోలీసులు ఆదివారం వాహన నిఖీలను నిర్వహించారు. ఒడిశా నుంచి మద్యం తదితర నిషేధిత వస్తువులు దిగుమతి కాకుండా తనిఖీలను నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. సుమానితులను ప్రశ్నించారు.



జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

నియమావళిని పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి)/ పాలకొండ/ కురుపాం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ ఆదేశించారు. కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ ప్రకటనలో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన పాలకొండలో పర్యటించారు. రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎ.వెంకట రమణ, ఇతర అధికారులతో కలిసి పట్టణంలో ఎన్నికల నియమావళి అమలును పరిశీలించారు. అనుమతి లేకుండా ఉన్న హోర్డింగ్‌లను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. సీ-విజిల్‌లో నమోదయ్యే ఫిర్యాదులను వంద నిమిషాల్లో, మీడియాలో ప్రచురితమైన వార్తలపై 24 గంటల్లో స్పందించి తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయన కురుపాం, సాలూరులోనూ పర్యటించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి.. నిబంధనలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమలులో అలసత్వం వహించరాదన్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ తదితరులు ఉన్నారు.

● కంట్రోల్ రూముల ఏర్పాటు....

ఎన్నికల దృష్ట్యా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లావాసులు తమ ఫిర్యాదులను 08963-796126, 08963-293046, ఎస్పీ కార్యాలయంలో 89775 19101 నంబర్లకు తెలియజేయాలని సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులున్నారు.

నిర్లక్ష్యం తగదు..

ఎన్నికల నియమావళి అమలులో నిర్లక్ష్యం తగదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన కోడ్ అమలు, ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని ఆయన ఆదేశించారు. కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, ఆర్డీవోలు కె.హేమలత, ఎ.వెంకటరమణ, ఏఎస్పీ దిలీప్ కిరణ్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, డీపీఆర్వో రమేష్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఆ కేంద్రాలకు చేరుకోవడమే పరీక్ష

- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- జిల్లాలో 22 సీ సెంటర్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పార్వతీపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి)/సాలూరు రూరల్ : జిల్లాలో నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే జిల్లా కొన్ని కేంద్రాలకు వెళ్లడమే విద్యార్థులకు అసలు పరీక్షగా మారింది. జిల్లాలో మొత్తంగా 66 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో 22 సీ సెంటర్లు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు విద్యార్థులు రోజూ దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంది. వారంతా సమయానికి ఎలా చేరుకుంటారన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. సాలూరు మండలం విషయానికొస్తే.. కొత్త వలస గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు 15 నుంచి 18 కిలోమీటర్లు నుంచి విద్యార్థులు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇక్కడ కురుకూటి, తోణాం, మావుడి, అంటివలస, మామిడిపల్లి గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల విద్యా ర్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ముగిసే వరకు కురుకూటి పాఠశాల బాలికలకు కొత్తవలసలో వసతి కల్పించారు. మిగిలిన విద్యార్థులు రోజు 15 నుంచి 18 కిలోమీటర్లు రాకపోకలు సాగించాల్సి ఉంది. బొడ్డవలసకు ఖరాస వలస, మామిడిపల్లి నుంచి 9 కిలోమీటర్ల మేర విద్యార్థులు ప్రయాణించాల్సి ఉంది. పెదబోరబంద, బాగువలస, శివరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రోజూ 10 కిలోమీటర్లు ప్రయాణించి సాలూరులో వివిధ పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. జిల్లాలో పలు కేంద్రాల పరిస్థితి ఇదే విధంగా ఉంది. విద్యార్థులకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించారు. ఆదివారం జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలను మండల విద్యాధికారులు పరిశీలించారు.

11,198 మంది హాజరు..

జిల్లాలో 210 ఉన్నత పాఠశాలల నుంచి 11,198 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. వీరిలో 5,124 మంది బాలురు, 5,410 మంది బాలికలు, మరో 664 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. 66 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 66 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు, 518 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ నెల 27 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 28,30 తేదీల్లో పదో తరగతి ఒకేషనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు మొబైల్స్ స్మార్ట్ వాచ్‌లు,ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకురాకూడదు. విద్యార్థులకిచ్చే ప్రశ్నపత్రంలో ఏడు సంఖ్యల సీరియల్ కోడ్ ఉంటుంది. పేపర్ లీకయితే ఈకోడ్ బట్టి ఏ సెంటర్లలో పేపర్ లీక్ అయ్యిందో ఇట్టే తెలిసిపోతుంది. అక్కడ సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ తదితరు లను బాధ్యులను చేయనున్నారు.

పొరపాట్లు లేకుండా ...

ఎటువంటి పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలని జిల్లా పదో తరగతి పరీక్షల ప్రత్యేకాధికారి సుబ్బారావు ఆదేశించారు. ఆదివారం పార్వతీపురంలోని విద్యాశాఖ కార్యాలయంలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, స్క్వాడ్ బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా టెన్త్ పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం పదో తరగతి ప్రశ్నపత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఈవో పగడాలమ్మ తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ...

జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేశామని డీఈవో పగడాలమ్మ తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. అరగంట ముందు కేంద్రానికి చేరు కోవాలని సూచించారు. ఈ సారి కూడా టెన్త్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధిస్తామనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



సాలూరు మండలం కొత్తవలసలో పదో తరగతి పరీక్ష కేంద్రం

నేటి నుంచి ఒంటిపూట బడులు

సాలూరు రూరల్, మార్చి 17: వేసవి నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సోమవారం నుంచి ఒక పూటే పని చేయనున్నాయి. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకూ తరగతులు నిర్వహించనున్నారు. పది పరీక్షలు జరిగే కేంద్రాల్లో మధ్యాహ్నం సమయంలో తరగతులు జరగనున్నాయి. మొత్తంగా 1,726 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విధిగా ఒంటి పూట తరగతులు నిర్వహించాలని డీఈవో జి.పగడాలమ్మ ఆదేశించారు.

అరకొరగా...

- తోటపల్లి నుంచి తగ్గిన తాగునీటి సరఫరా

గరుగుబిల్లి, మార్చి 17 : తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువల నుంచి తాగునీటి సరఫరాను తగ్గించేశారు. నాగావళి నదిలో రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో ఈ మేరకు అధికారులు తక్కువగా నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 102.76 మీటర్ల మేర నీటి నిల్వ సామర్థ్యం ఉంది. గతంలో ఎన్నడూ నాగావళికి ఈ పరిస్థితి ఎదురుకాలేదు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో నాగావళికి నీటి సమస్య ఎదురైంది. పైనుంచి నదిలోకి 324 క్యూసెక్కుల నీరు చేరగా, తాగునీటి అవసరాల నిమిత్తం నదీ తీర ప్రాంతవాసులకు 140 క్యూసెక్కులు, కుడి, ఎడమ ప్రధాన కాలువల నుంచి 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తు న్నారు. దీంతో పార్వతీపురం మున్సిపాలిటీ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఎండలు తారాస్థాయికి చేరుతుండడంతో జిల్లాకేంద్ర వాసులతో పాటు నదీతీర ప్రాంత వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ ఏడాది రబీలో తోటపల్లి రెండు కాలువల పరిధిలో వేసిన వరి, నువ్వులు, తదితర పంటలు ఎండుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



కుడి కాలువ నుంచి తక్కువ స్థాయిలో సరఫరా అవుతున్న తాగునీరు

భక్తజన సందడి

- ఘనంగా ఎల్లమ్మతల్లి, శిర్లిపోతన్న యాత్ర ప్రారంభం
- దర్శనాలకు పోటెత్తిన భక్తులు



పూజలందుకున్న ఎల్లమ్మతల్లి పుట్ట

పార్వతీపురం టౌన్/ పాలకొండ/ వీరఘట్టం/ భామిని/ సాలూరు రూరల్: జిల్లావ్యాప్తంగా ఎల్లమ్మతల్లి, శిర్లిపోతన్న స్వామి యాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం అంతటా జాతర్ల కోలాహలం నెలకొంది. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఎల్లమ్మతల్లి, శిర్లి పోతన్న దర్శనానికి క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలో దుర్గాదేవి వీధిలోని ఎల్లమ్మ, పోతన్నలను దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచే క్యూలైన్లలో నిరీక్షించారు. పాలకొండలోని శిర్లిపోతన్నస్వామి యాత్ర మహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం స్వామివారి సింధూరం కుండ తిప్పారు. రాత్రి 9.30 గంటలకు పాలజంగిడి ప్రదర్శన ఘనంగా చేపట్టారు. ఈ జాతర అనంతరం పాలజంగిడి ప్రదర్శన ఎంతో మోక్షం కలిగిస్తుందని భక్తుల నమ్మకం. శతాబ్దాల కాలం నుంచి ఏటా శివరాత్రి తర్వాత వచ్చే అష్టమితిథి రోజున ఈ జాతర జరపడం ఆనవాయితీ. వీరఘట్టంలో ఎల్లమ్మతల్లి తల్లి దర్శనానికి పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. మూడు రోజుల పాటు యాత్ర నిర్వహించ నున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భామినిలో శిర్లి ఎల్లమ్మ జాతరలో చిన్నారులు, పెద్దలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పలువురు శుద్ధిస్నానాలు చేసి ప్రతి ఇంటిలో జోగి దండి ఎల్లమ్మ గుడికి వెళ్లారు. ఈ ప్రాంతంతో పాటు నది అవతల ఉన్న ఒడిశాకు చెందిన వారు కూడా యాత్రకు తరలి వచ్చారు. సాలూరు పెదహరిజనపేటలో అమ్మవారు, పోతురాజు గద్దె వద్దకు వేకువ జాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. పట్టణ పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. మొత్తంగా జిల్లా అంతటా ఆధ్యాతిక శోభ వెల్లివిరిసింది.



పాలకొండ: దర్శనానికి బారులుదీరిన జనం



శిర్లిపోతన్న స్వామి..



సాలూరులో ఎల్లమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



పార్వతీపురం టౌన్‌లో..



వీరఘట్టంలో..

ప్రజాగళం.. ప్రభంజనం


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట






ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





పదో తరగతి పరీక్షలకు సిద్ధం

వంగర: మండలంలో సోమవారం నుంచి మూడు కేంద్రాల్లో జరిగే పదో తరగతి పరీక్షలకు 510 మంది హాజరు కానున్నట్లు ఎంఈవోలు దుర్గారావు, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వంగరలో వారు విలేకరులతో మాటాడుతూ వంగర జడ్పీలో 180 మంది, సీతారాంపురంలో 120 మంది, మద్దువలస గురుకు లంలో 210 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు.

● **లక్కవరపుకోట:** పదో తరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎల్.కోట మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఎంఈవో కూర్మారావు తెలిపారు. జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. రెండు కేంద్రాల్లో 523 మంది విద్యార్థులు పరీక్షలు రాయ నున్నట్టు తెలిపారు. కొత్తవలస మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో 963 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 గంటలవరకు జరుగుతుందన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

వంగర: వంగర కేజీబీవీలో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ బైపీసీలో ప్రథమసంవత్సరంలో చేరేందుకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రోహిణి తెలిపారు. ఆదివారం వంగరలో విలేకరులతో మా ట్లాడుతూ ఇంటర్, ఆరోతరగతిలో ప్రవేశానికి 40 సీట్లు చొప్పు న ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. వివరాలకు ఫోన్ 7287007924 నంబరుకు సంప్రదించాలని కోరారు.

మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని ఖండ్యాంలో ఆదివారం పోలీసులు నిర్వహించిన సోదాల్లో 25 మద్యం సీసాలు స్వాధీనం చేసు కుని ఒకరిని అరెస్టుచేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు గ్రామంలో కిరాణా షాపులో మద్యం విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

రాజాంలో కళాజాత

రాజాం: రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర పురస్కరించుకుని సలాది వెంకటరమణ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కళాజాతను గ్రంధి చినసన్యాసిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో సలాది తులసీదాస్, అర్నిపల్లి వెంకటనాయుడు, మక్క అప్పలనాయుడు, పెంకి గౌరీశ్వరరావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, పొగిరి సురేష్, రెడ్డి విజయకుమార్, కరణం శంకరరావు, కూరాడ హరి, రంపా జగదీశ్వరశర్మ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

రాజాం: రాజాం పురపాలకసంఘం పరిధితోపాటు వివిధగ్రా మాల్లో ఉన్న ఫ్లెక్సీలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఎన్నికల డీటీ ప్రకాష్ ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. అన్ని పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను తొల గించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గ్రామాల్లో కూడా ఏ పార్టీకి చెందిన ఫెక్సీలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంచేస్తే చర్యలు తప్పవని ఆదేశించారు.

శృంగవరపుకోట: మండల కేంద్రంలో ఎన్నికల కోడ్ అమలును అధికారులు ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం నుంచి పట్టణంలో ఉన్న విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఫ్లెక్సీలు తొలగించారు. ఎవరు ఎన్నికల నిబంధనలను పాటించకపోయిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కాగితాపల్లిలో టీడీపీ ఇంటింటి ప్రచారం

రేగిడి: మండలంలోని కాగితాపల్లిలో టీడీపీ నాయకుడు దూబ ధర్మారావు పార్టీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీ మోహనరావుకు మద్దతుగా ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దూబ అప్పలనాయుడు, కాగితాపల్లి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కాగితాపల్లిలో టీడీపీ గ్యారెంటీ పథకాలపై ప్రచారం చేస్తున్న నాయకులు

ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలి



విజయనగరం దాసన్నపేట, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని, ఓటు హక్కు వినియోగించుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్ అండ్ బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 4 కోట్ల 9 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, అందులో యువతే ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రజల జీవితాల్లో మార్పునకు ప్రతి ఒక్క ఓటరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగాలన్నారు.

పోలీసుల లాంగ్ మార్చ్

రామభద్రపురం, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీని వాసరావు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు లాంగ్ మార్చ్ నిర్వ హించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకు నేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విస్తృతంగా పోలీసు బందో బస్తు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆయుధాలు తీసు కొని గ్రామంలోని పురవీధుల్లో లాంగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్ కూడా పాల్గొన్నారు.

● ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలను రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించారు. అలాగే కొన్ని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.


లాంగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి

రామభద్రపురం, మార్చి 17: రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కోడ్‌ఆఫ్ కాండక్ట్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో చుక్కా ఈశ్వరమ్మ సూచించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం ఆమె గ్రామ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల్లో ఏ రాజకీయ పార్టీకి సంబంధించి బ్యానర్లు, కటౌట్‌లు లేకుండా చూడాలన్నారు. రాజకీయనాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, గ్రామ పంచాయతీల్లో కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ రమణ, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. తహసీల్దార్ ఆకుల సులోచనారాణి కూడా మండల రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం ఏర్పాటు చేసి మండల కేంద్రంలో మోడల్ కోడ్‌ఆఫ్ కాండక్ట్‌ను తూచాతప్పకుండా అమలు చేయాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఆకస్మిక బదిలీలెందుకో!

ఎన్నికల కోడ్‌కు కొద్ది గంటల ముందే మార్పులు
ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్ల మార్పు

రాజాం, మార్చి 17: రాజాం గృహనిర్మాణశాఖ సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నపలంగా బదిలీ అయ్యారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి కొన్ని గంటల ముందు శనివారం ఉదయం ఈ తంతు జరిగింది. ఈ విషయం సర్వత్రా చర్చనీయాంశమైంది. వంగర, రాజాం, రేగిడి, సంతకవిటి, రాజాం అర్బన్ కంప్యూటర్ ఆపరేటర్లను తాజాగా బదిలీ చేశారు. కాగా వంగర కంప్యూటర్ ఆపరేటర్‌పై వివాదం నడుస్తోంది. అయితే ఒకరికి కాకుండా ఐదుగురికి ఒకేసారి బదిలీ చేయడంపై సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ ప్రమేయం ఉందా అన్న సందేహాలున్నాయి. బదిలీ ఉత్తర్వుల్లో వెంటనే కొత్త స్థానంలో బాధ్యతలు స్వీకరించాలని కూడా పేర్కొన్నారు. బదిలీ చేశారు కాని డివిజన్ మాత్రం మార్చలేదు. ఈ డివిజన్ పరిధిలోని మండలాలకే మార్చారు. ఇదే విషయమై గృహ నిర్మాణ శాఖ డీఈ రత్నాకర్‌ను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు గృహనిర్మాణ శాఖ పీడీ వి.శ్రీనివాసరావు కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేశారని, ఎందుకు చేశారన్న విషయం తనకూ తెలియదన్నారు.

ఎన్నికల నిబంధన ఉల్లంఘన

విజయనగరం రూరల్: నగరంలోని 40వ డివిజన్ పరిధిలోని పోలయ్యపేట, గోశాల వీధిలో కొత్తగా పైపులైన్లు ఏర్పాటు చేసే నిమిత్తంగా సామగ్రి సిద్ధంగా ఉంచారని టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ముద్దాడ చంద్రశేఖర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు నాగలక్ష్మికి వినతిపత్రం మెయిల్‌లో పంపించారు. ఎంతో కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, పట్టించుకోని వారు.. హఠాత్తుగా అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ విధంగా చేస్తున్నారని, ఇది ఓటర్లను ప్రభావితంగా చేసే విధంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

విజయనగరం క్రైం, మార్చి 17: జిల్లాలో వివిధ పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్షలను ఎస్పీ దీపిక స్వయంగా పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా పరీక్షలు జరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎస్పీ దీపికా వెంట డీఎస్పీ ఆర్ గోవిందరావు, సీఐ కె రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు సుమారు 61.46 శాతం మంది హాజరయ్యారు. ఈ ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో మొత్తం 6,568 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 4,069 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 4,037 మంది రాశారు. ఈ పరీక్షలను జేసీ కార్తీక్, డీఆర్‌వో అనిత, ఏపీపీఎస్సీ అధికారులు పర్యవేక్షించారు.

రాజాంరూరల్: రాజాంలోని జీఎంఆర్‌ఐటీలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 1440 మందికి 626 మంది, రెండోపూట జరిగిన పరీక్షకు 1440 మందికి 624 మంది హాజరయ్యారు.


విజయనగరంలో పరీక్ష కేంద్రం వద్ద..


పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

బొబ్బిలి, మార్చి 17: బస్సు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన బొబ్బిలిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక యాదవవీధికి చెందిన కొల్లి పార్వతి (56) కాయకష్టం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం నడుచుకుంటూ ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వస్తుండగా బొబ్బిలి పట్టణంలోని పూల్‌బాగ్ సెంటర్‌లో సాలూరు ఆర్టీసీ డిపోకు చెందిన నారాయణపురం బస్సు ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో పార్వతీ తీవ్రంగా గాయపడడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె మృతి చెందింది. భర్త లేని పార్వతికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పో స్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చదలవాడ తెలిపారు. పార్వతి రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిందని తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

బొండపల్లి, మార్చి 17: ఆటోను కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ ఎల్.గోపి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెలిమర్లలోని రామతీర్థం జంక్షన్‌కు చెందిన యాండ్రపు దేవుడు(36) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున నెలివాడకు సమీపంలోని రాజచెరువు వద్ద నుంచి చేపలను ఆటోలో లోడ్ చేసుకుని స్వగ్రామం వెళ్తుండగా నెలివాడ జాతీయ రహదారిపై పార్వతీపురం వైపు నుంచి విజయనగరం వైపు వెళుతున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో ఆటో ముందు భాగం నుజ్జయి డ్రైవర్ దేవుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో విజయనగరంలోని జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతునితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతునికి భార్య లక్ష్మితోపాటు 10 సంవత్సరాల వయస్సు ఉన్న ఇద్దరు కుమార్తెలు ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో జిల్లా వాసి మృతి

అనకాపల్లిలో ఫ్లెక్సీ తొలగిస్తుండగా ఘటన

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగా గ్రామ సచివాలయం ఉద్యోగి ఒకరు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ సంఘటన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపిన సమాచారం మేరకు ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన డెక్క చిరంజీవి (34) అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను ఆదివారం సాయంత్రంలోగా తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు కొత్తపెంట సచివాలయం పరిధిలోని ఫ్లెక్సీలు తొలగించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి తన స్నేహితుడు దాసరి శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ములకలాపల్లి చేరుకున్నాడు. పాల కేంద్రానికి సమీపంలో వున్న ఒక ఫ్లెక్సీని చిరంజీవి తొలగిస్తుండగా.. దీని ఇనుప చట్రం, పైన వున్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలోని పొలాల్లో పనులు చేస్తున్న రైతులు, కూలీలు వచ్చారు. ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో తొలుత ఇసుక తీసుకువచ్చి అతని శరీరంపై పోశారు. సమీపంలో వున్న ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందిని రప్పించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్య సిబ్బంది చెప్పారు. మృతుడు చిరంజీవికి భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3), తల్లి కృష్ణమ్మ ఉన్నారు. హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ.డి.నాగేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా విద్యుదాఘాతంతో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి ఫోన్ చేసి కోరారు.

ఎన్నికల కోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

నెల్లిమర్ల: ఎన్నికల కోడ్ అమలులో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి.రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కోడ్ అమలుకు సంబంధించి ఆదివారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ కోడ్‌పై ముందుగా ఉద్యోగులు అవగాహన చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ నాయకులకు సంబంధించి ఎలాంటి చిత్రపటాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉన్నా తొలగించాలని అన్నారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు ధరించాలని సూచించారు. కోడ్ అమలులో ఉద్యోగులు ఎలాంటి రాజీ ధోరణి ప్రదర్శించరాదని, కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధర్మరాజుతో పాటు ఈవోపీఆర్డీ కె.సింహాద్రి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



లాడ్జీల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రామారావు

విజయనగరం క్రైం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఆయా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ కోరాడ రామారావు హెచ్చరించారు. ఎస్పీ దీపికా ఆదేశాలతో శనివారం నగరంలోని లాడ్జిల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులకు ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రవేశం ఇవ్వరాదన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా, అక్రమంగా మద్యం, నగదు నిల్వలు ఉంటే, చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేరడిలో పోలీసు కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

భామిని: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు బలగాలు, ప్రత్యేక బృందాలు ఆదివారం నేరడి గ్రామంలో కవాతు నిర్వహించాయి. ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిర్లి ఎల్లమ్మ జాతర జరుగుతున్నందున ప్రశాంతంగా జాతర నిర్వహించాలని ఆలయ కమిటీకి సూచించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1975-76 చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాలకు తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు హరి, రథో, వ్యాపారవేత్త పాండురంగ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ శేఖర్, వైస్ సర్పంచ్ కిషోర్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దత్తిరాజేరు: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవో ఎం.వెంకటరావు తెలిపారు. సోమవారం నుంచి మండలంలోని మరడాం, దత్తిరాజేరు, పెదమానాపురం ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పరీక్షలకు 546 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు జరుగుతుందన్నారు. అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాల్‌టికెట్‌తో హాజరు కావాలని కోరారు. ● **కురుపాం:** మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎస్.సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి తెలిపారు. మండలంలో కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ ఆదర్శ పాఠశాల, ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఇందులో 686 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం

శృంగవరపుకోట: పది పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్‌టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు డీఎం రమేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష రోజున మాత్రమే ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు తమ ఇంటినుంచి పరీక్ష కేంద్రంకు వెళ్లే సమయంలో బస్సులో కండక్టర్‌కు తమ హాల్‌టిక్కెటు చూపించి ప్రయాణించవచ్చన్నారు.

ప్రజాగళం సభలో కోళ్ల



ప్రజాగళం సభా ప్రాంగణం వద్ద లలితకుమారి

శృంగవరపుకోట: చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభకు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన అనుచరగణంతో కలిసి వెళ్లారు.ఈ చారిత్రాత్మక బహిరంగసభలో పాల్గొనడం తన అదృష్టం అని తెలిపారు.

వంశధార నదిలో విగ్రహాలు లభ్యం



నదిలో లభ్యమైన విగ్రహాలు

భామిని: ప్రతిపాదనలో ఉన్న నేరడి బ్యారేజీ వంశధార నదీతీరాన ఆదివారం పలు విగ్రహాలు లభ్యమయ్యాయి. బ్యారేజ్ సిబ్బంది స్నానం చేస్తుండ గా విగ్రహాలు బయటపడ డంతో ఒడ్డుకు చేర్చారు. సీతారాములు, నంది తదిత ర విగ్రహాలను ఒడ్డుకు చేర్చా రు. ఎవరో ఈ విగ్రహాలను ఇక్కడ నిమజ్జనం చేసి ఉంటారని భావిస్తున్నారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి

పాలకొండ: వినియోగదారుల హక్కులు, చట్టాలపై విద్యార్థులు తెలుసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్యాంబాబు అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి పి.రాజ్యలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- ఉమ్మడి అభ్యర్థుల పిలుపు
- పలుచోట్ల టీడీపీలో భారీగా చేరికలు
- గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం



గంట్యాడ: టీడీపీలో చేరిన మరువాడ కొత్తవలస సర్పంచ్‌తో ప్రచారం చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి శ్రీనివాసరావు



పార్వతీపురం: విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు



బొబ్బిలి: పార్టీలో చేరినవారితో బేబీనాయన

విజయమే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలో టీడీపీలో భారీగా చేరారు. అలాగే ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్, జయహో ఎస్సీ కార్యక్రమాలు నిర్వహించి వైసీపీ ప్రభుత్వ వైఫలాలు వివరించారు.

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వమేనని మన్నారు. వైసీపీని ఇంటికి పంపించడమే లక్ష్యంగా ప్రజలు ఉన్నారన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలపై జనసేన పార్టీ నాయకులు విజయ్‌చంద్రకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ● భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై టీడీపీ, జనసేన పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని విజయచంద్ర కోరారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో లక్ష్మీనారాయణపురం ఎంఆర్‌నగరం తదితర గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

పార్వతీపురం రూరల్: లక్ష్మీనారాయణపురంలో ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్రకు ఆదివారం పర్యటించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవి చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆయన ప్రచారం చేశారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, చుక్క లక్షుంనాయుడు, చుక్క పోలినాయుడు, కొత్తాడ శ్రీనివాసరావు, జమిలిరెడ్డి బాల, వడిగల శంకరరావు, తెర్లి త్రినాథ, తెర్లి రవి, ఎల్‌పీ త్రినాథ, కోలా మధు తదితరులు పాల్గొన్నారు.

భారీ సంఖ్యలో చేరిక

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: తెలుగుదేశంపార్టీలో భారీ సంఖ్యలో యువకులు ఆదివారం రాత్రి చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి విజయచంద్ర ఆధ్వర్యంలో టీడీపీలోకి యువకులు చేరారు. శివ ఫైర్‌చాట్ ఆధ్వర్యంలో యువకులు పార్టీలో చేరడం పట్ల విజయచంద్ర ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **గంట్యాడ:** బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస గ్రామ సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు టీడీపీలో చేశారు. గంట్యాడలో ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసరావు సమక్షంలో ఆదివారం ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన తోపాటు మాజీ సర్పంచ్‌లు దాసరి శంకరరావు, బంగారు నాయుడు, మాజీ ఉపసర్పంచ్‌లు మజ్జి అప్పారావు, వార్డు మెంబర్లు కంది రాము, కోరాడ వైకుంఠరావు, దాసరి అనసూయ, పాండ్రంగి నాగేశ్వరరావు, కర్రోతు అప్పలరాజు, కర్రోతు కృష్ణ, మజ్జి అప్పలనాయుడు, మరో 150 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరికి కొండపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు రంధి రామునాయుడు, కిలిరెడ్డి పాపునాయుడు, పల్లి వెంకటరావు, బీల అప్పలనాయుడు, వెంకటరావు, వాసిరెడ్డి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పూల్‌బాగ్‌లో ఇంటింటి ప్రచారం

విజయనగరం రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరుతూ నగరంలోని రెండో డివిజన్ పరిధిలోని పూల్‌బాగ్‌లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలకు ప్రజలకు వివరించి, రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకి ఓటేయ్యాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిల్లాన మహేష్, ప్రసాద్‌రావు, మహంతి శ్రీరవి, వి రామునాయుడు, వి.సుబ్రహ్మణ్యం, వి.బాబురావు, డి పాపారావు, బి మురళీ, ఆవాల రోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమం

టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరంలో ఆదివారం 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థకు వెళ్లి కొత్తగా ఓటు పొందిన వారిని,నిరుద్యోగులను, యువతను కలిసి అదితిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు పొగిరి పైడిరాజు, మాతా బుజ్జితో పాటు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విజయనగరంలో 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం'

విజయనగరంలో 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం' కార్యక్రమాన్ని 14, 15 డివిజన్ల పరిధిలోని గుంటూరువారు వీధి, అద్దేపల్లెవారి వీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు ప్రచారం నిర్వహించారు. రానున్నఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు విజయానికి సహకరించాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు పేరిరామయ్య పంతులు, సారిపాక రమణమూర్తి, సంబర సన్యాసిరావు, మార్ల రవికుమార్, మద్దాల నాగకుమారి, రామారావు పాల్గొన్నారు.

లంకాపట్టణంలో 'జయహో ఎస్సీ'

విజయనగరంలోని 19వ డివిజన్ లంకాపట్టణం, రౌతువీధి, చిన గోకపేట తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని టీడీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు 'జయహో ఎస్సీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కె పైడిరాజు, ఎస్ శంకరరావు, పి రాజేష్, సియ్యాదుల శేఖర్, దేవరాపల్లి రామ్ పైడి హరి, దానా రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సంక్షేమం

మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ మహిళా నాయకులు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని 7, 18,19 డివిజన్లపరిధిలోని నాగవంశం వీధిలో డ్వాక్రా మహిళలతో టీడీపీమహిళా విభాగం సమావేశాలు నిర్వహించింది. కార్యక్రమంలో విజయనగరం మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ కనకల మురళీమోహన్, టీడీపీ మహిళావిభాగం నేతలు అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, పద్మలత, సునీత, వెలిచేటి మణికుమారి పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు టీడీపీలోకి..

బొబ్బిలి: బొబ్బిలి కోటలో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) సమక్షంలో బంకురువలసకు చెందిన వైసీపీ నాయకులు మత్స నాగేశ్వరరావు అనుచరులతో పార్టీలో చేరారు. టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన నాగేశ్వరరావును బేబీనాయన కండువాలు వేసి స్వాగతం పలికారు. అలాగే తెర్లాం మండల టీడీపీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు ఆధ్వర్యంలో కొత్తవలస గ్రామానికి చెందిన ఏలిన శివాజీ మాస్టర్, రెడ్డి ముకుందనాయుడు నాయకత్వంలో వైసీపీకి నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. రానున్న ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి అత్యధిక మెజార్టీని సాధించాలని బేబీనాయన పిలుపునిచ్చారు.



విజయనగరం రూరల్: సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న దృశ్యం



విజయనగరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు



విజయనగరం: మాట్లాడుతున్న టీడీపీ మహిళా విభాగం నాయకులు

ఘనంగా అమ్మవారి జాతరలు

జిల్లాలోని పలు గ్రామాల్లో వివిధ అమ్మవార్ల జాతరలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ఎల్లమ్మతల్లి..

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో చిక్కాల రెల్లివీధి ప్రజల ఆరాధ్యదేవత అయిన ఎల్లమ్మతల్లి- పోతన్న సిర్లి మహోత్సవం ఆదివారం కన్నులపండువగా నిర్వహించారు. స్థానిక గొల్లవీధిలోగల అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక పెద్దసంఖ్యలో చేరుకుని దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యురాలు గోనా మానసతో పలువురు భక్తులు సంప్రదాయసిద్ధమైన భోనాలను అమ్మవారికి సమర్పించుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన కూడా గ్రంథాలయానికి విచ్చేసి అమ్మవారి బోనాన్ని తలపై ఉంచుకుని దర్శనం చేసుకున్నారు. భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. గొల్లవీధి జంక్షన్ అంతా భక్తులతో కిటకిటలాడిపోయింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ● **నెల్లిమర్ల:** మండలంలోని సతివాడ, జరజాపుపేట గ్రామాల్లో ఎల్లమ్మతల్లి పండుగ ఆదివారం నిర్వహించారు. సతివాడలో నిర్వహించిన సిరిమాను ఉత్సవంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజాంలో పోలిపల్లి పైడితల్లి..

రాజాం: పట్టణంలో వెలసిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



రాజాం: పోలిపల్లి పైడితల్లి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రాజాం రూరల్: ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

20న కొత్తమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం

సాలూరు రూరల్: సాలూరులో కొత్తమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం ఈ నెల 20న జరగనున్నట్టు కోదండరామ ఆలయ అభివృద్ధి చారిటబుల్ ట్రస్టు తెలిపింది. ఈ మేరకు ఆదివారం పంచముఖేశ్వర ఆలయం నుంచి తిరువీధి నిర్వహించారు. ఈనెల 18, 19 తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 20న విగ్రహ ప్రాణ ప్రతిష్ట నిర్వహించనున్నారు. ● దత్తివలస బురదాలమ్మ గ్రామదేవత పండగ నేపథ్యంలో ఆదివారం గ్రామంలో గడి కట్టారు. వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో బురదాలమ్మ పండుగ జరగనున్నది. ఈనేపథ్యంలో దేశమ్మకు వారోత్సవం చేశారు. అనంతరం గ్రామానికి గడికట్టారు.

రాజాంలో శిర్లుపోతన్న జాతర

రాజాం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్ ఆవరణలో ఉన్న రేణుకా ఎల్లమ్మ తల్లి శిర్లుపోతన్న ఆలయం వద్ద ఆదివారం జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున హాజరై ఎల్లమ్మతల్లిని దర్శించుకుని పసుపు-కుంకుమ సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లపు రాజు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



బొబ్బిలి: ఘటాన్ని మోస్తున్న బేబీనాయన



సాలూరు రూరల్: తిరువీధిలో మహిళలు

క్లుప్తంగా..

4 నుంచి కైలాసనాథ స్వామి యాత్ర

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలో కైలాసనాథ స్వామి యాత్రను ఏప్రిల్ 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తెలిపారు. ఎల్ఎన్‌పేట పోలీసుల సహకారాన్ని తీసుకుంటున్నామని చెప్పారు. యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి శ్రీకోటదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

మక్కువ: మక్కువలో శ్రీకోటదుర్గమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాలను సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాలకు విచ్చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

సామాజిక సేవలో ముందుండాలి

సాలూరు రూరల్: సామాజిక సేవలో అందరూ ముందుండాలని టీడీపీ అరకు పార్లమెంటరీ అధికార ప్రతి నిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఆర్థిక సాయంతో బీజేపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలుమూరు మణికుమార్ ఆధ్వర్యంలో సాలూరులో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కోరాడ నరేష్‌కుమార్, బీజేపీ నేత ఆర్.లక్ష్మణరావు, శ్రీనురెడ్డి, ప్రసాదరావు పాల్గొన్నారు.



లోకం ప్రసాదు ఆధ్వర్యంలో జనసేనలో చేరిన యువకులు

జనసేనలో చేరిక

భోగాపురం: పెదకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన 1, 2 వార్డు మెంబర్లు సూరాడ అప్పయ్యమ్మ, ఎరుపల్లి రాములమ్మ జనసేన పార్టీలో చేరారు. ఆదివారం ముంజేరు గ్రామంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు లోకం ప్రసాదు, మండల అధ్యక్షుడు వందనాల రమణ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. ● పూసపాటిరేగ మండలం కుమిలి పంచాయతీలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలో చేరాయి. పార్టీ నాయకుడు లోకం ప్రసాదు ఆధ్వర్యంలో వీరు జనసేనలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు జలపారి అప్పడుదొర పాల్గొన్నారు.

కోడ్ అమల్లోకి..

కురుపాం: రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా ఆదివారం కురుపాంలోగల బహిరంగ ప్రదేశాల్లోని అన్ని రాజకీయ పక్ష నాయకుల కటౌట్లు, పోస్టర్లను పంచాయతీ, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది తొలగించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కె.చంద్రశేఖరరావు, వీఆర్వో మహేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ సూర్య, వీఆర్ఏలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు. ● **పాలకొండ:** సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుల్లోకి రావడంతో పట్టణంలో రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను నగర పంచాయతీ సిబ్బంది ఆదివారం తొలగించారు. కమిషనర్ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు తొలగించారు. అలాగే పట్టణంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించారు. ● **వీరఘట్టం:** ఎన్నికల నగరా మోగడంతో శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలో వివిధ పార్టీల ఫ్లెక్సీలను ఆదివారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. ప్రత్యేక వాహనంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తరలించారు.



కురుపాంలో బ్యానర్లు తొలగిస్తున్న దృశ్యం



పాలకొండలో ఓ రాజకీయ నాయకుడి విగ్రహానికి ముసుగు